


* ఆయపిళ్ల రామారావు *

"అమ్మా నేను వచ్చేంత వరకూ ఆకలితో ఉండకపోతే యేం! నువ్వు తినేసి విశ్రాంతి తీసుకోరాదూ, నీ శరీరంలో కూడ బాగాలేదాయె!" అన్నది మాలతి సుందరమ్మతో.

"అదెట్లా సాధ్యమౌతుంది అమ్మాయి. నీ కన్నా నా ప్రాణం హెచ్చా! అయినా నీకెందు కింత శ్రమ? ఇంత ఆలస్యంచేసుకోటానికి నీకేం అవసరం? నీ ఆరోగ్యము చెడుతూందని నాకేమీ తోచటం లేదు తల్లీ." కళ్లంట నీళ్లు తిరుగుతున్నాయి సుందరమ్మకు.

"నాకేం తక్కువమ్మా! నా ఆరోగ్యం బాగానే వుంది."

"ఆ సంగతిప్పుడు తెలీదమ్మాయి" కళ్ల నీళ్లు తుడుచుకుంటూ అంది సుందరమ్మ.

సుందరమ్మకు తనకడచిన జీవితమంతా స్మరణకు వచ్చింది. మాలతిదింకా లేతహృదయం. పైగా ఇప్పుడే చదువు ముగించి మిస్ట్రెస్‌గా ఒక స్కూల్లో పని చేస్తూంది. క్రొత్త క్రొత్త రుచులకోసం ఆశిస్తూ వుంటుంది. తన రుచుల కోసం విలాసాలకోసం వ్యభిచరించటానికి కూడా సంకోచించదు. సుందరమ్మకన్న వ్యభిచారిణులుండరేమో! అయినా ఆమె కడుపు కోసం లేదా ఒక కారణం కోసం వ్యభిచరించింది. సుందరమ్మకు వ్యభిచారమంటే, ఎంత రోతో అంత తప్పని సరి అయింది. మాలతికి అది ఎంత అనవసరమో అంత సులువయింది. అది పాశ్చాత్య నాగరికత లక్షణాల్లో ఒకటి. పాశ్చాత్యులు విలాసం కోసం వ్యభిచరిస్తారు. భారత నారి కూటి కోసం లేదా ఒక ప్రత్యేక కారణం కోసం విధిలేక వ్యభిచరిస్తుంది. మన ధర్మాల్లో వ్యభిచారం మహాపాపం. వాళ్లల్లో దానికంత పట్టింపులేదు. మాలతిని అల్లాంటి పనికి గురికాకుండా చేయటానికే సుందరమ్మ తన జీవితాన్ని కష్టాన్ని ధారపోసింది.

ఆమె భర్త పోలీసు కాన్స్టేబిల్‌గా వుండేవాడు. అతడు ఏదో విధంగా లంచాలు పుచ్చుకోని రోజేవుండేది కాదు. ఆ డబ్బుమాత్రం మిగిలేదా! దాంతోపాటు జీతంలో సగం వరకుకూడ అతని త్రాగుడు క్రిందనే వ్యయమయ్యేది. అతడు త్రాగకుండా ఇంటికివచ్చిన రోజేదీ? పూర్తి మైకంతో సుందరమ్మను మోదుతూండేవాడు. సుందరమ్మ అభోజనంగా పస్తులుపడిన రోజులు తరచుగావుండేవి. ఆమె కంత కంతకు దినములు దుర్భరమయాయి. ఒక నాడతడు త్రాగి కైపెక్కి ఇంటికివచ్చి భోజనం పెట్టమన్నాడు సుందరమ్మను. "బియ్యం నిండుకున్నాయి, ఎవరూ అప్పియ్యమన్నారు" అందామె. ఒళ్లు తెలియని మత్తుతో ఆమెను చావమోది బయటకు పోయాడు.

ఆమె కంతట్టితో ఆ బ్రతుకు దుస్సహామనిపించింది. అదిగాక చేతిలో పసికూన మాలతిని బ్రతికించటానికైనా ప్రయత్నించాలని తలచిందామె. ఆ బాధలనుభవించే కన్న ఏ పనిచేసినా మంచిదే అని నిశ్చయించుకుంది. మరు

క్షణంలో మాలతితోకూడ పరారయింది. నా అనే వాళ్లుంటేగా ఎక్కడైనా! ఉన్నా భర్తను విడిచిందని బుగ్గలు నొక్కుకునే వాళ్ళేగాని కారణం విచారించి ఆదరిస్తారా! మొండి ధైర్యంతో ఆమె కలకత్తాలోవున్న షిబ్‌పూర్ చేరుకుంది.

ప్రపంచంలో నరకం అనుభవించే కర్మ చేసుకున్న వాళ్లంతా అక్కడ కనిపిస్తారు. అక్కడ వుండే వాళ్లంతా కూలివాళ్లే. అందులోను అతిచవకరకం కూలీలు. అందుకే పనికూడ సులువుగా దొరుకుతుంది. మాన మర్యాదలున్న వాళ్లు ఆ పనుల్లో నెగ్గలేరు. సుందరమ్మ ఒక జనపనార మిల్లుల్లో కూలీగా చేరింది. ఆమె కందేరాళ్లు తినటానికేనా సరిపోయేవి కావు. ముఖ్యంగా మాలతిని గురించి దిగులుగా వుండేదామెకు. మాలతి బాగు కోసం ఎల్లాంటి పనేనా చెయ్యటానికి నిశ్చయించుకుందామె. మొదట్లో చిరునవ్వులతో కొద్ది కొద్దిగా డబ్బు అదనంగా సంపాదిస్తూండేది. క్రమంగా మాలతిని విద్యావంతురాల్ని చెయ్యాలన్న సంకల్పంతో కొద్దిగా వ్యభిచారం చేస్తూ డబ్బు సంపాదిస్తూండేది. చివరకు వ్యభిచారం ఆమె వృత్తి అయింది. మాలతిని విశాఖపట్టణం కాన్వెంటు స్కూల్లోవుంచి ఆమె చదువు కొరకై విపరీతంగా ధనాన్ని ఆర్జించి పంపిస్తూండేది. తన రక్తాన్ని జీవితాన్ని కూడ ధారపోసి మాలతికి డబ్బు పంపుతూండేది. మాలతికి వ్యభిచారంగాని బీదరికంగాని అబ్బకూడదనే ఎల్లప్పుడూ సుందరమ్మ కోరుతూండేది. తనవద్దకు మాలతి వస్తే ఏమనుకుంటుందో అని అవకాశం చూసుకొని తనేవెళ్లి చూసి తిరిగి వస్తూఉండేది.

అట్లా సంవత్సరాలు గడచేయి. మాలతి చదువు, ట్రెయినింగు ముగిసేయి. ఉద్యోగంలో కూడ ప్రవేశించింది. ఇక తనకు ఆ నీచవృత్తితో అవసరంలేదని సుందరమ్మ మాలతి వద్దకు వచ్చేసింది. కష్టజీవి, కాని మాలతి సంగతి ఆమెకు మరింత కష్టాన్ని కలిగించింది. మాలతికి విలాసాలంటే సరదా. ఉద్యోగం సంపాదించుకుంది. ఇల్లంతా అందమైన వస్తువులతోటి సోఫాలతోటి నింపేసింది. తృప్తిగా భోజనంచేస్తుంది. విలాసజీవిత కాంక్షలకు తన సౌశీల్యాన్ని ఆహుతి జేసింది. ఒకొక్కనాడు సినీమాలకీ పార్కులకి వెళ్ళి చాల ఆలస్యంగా వస్తూంటుంది. సుందరమ్మ కిదంతా మళ్లీ దుఃఖకర సంఘటన. తన కందుతూన్న జీతంతోనే కాలంబుచ్చుచూ, పెళ్ళి చేసుకొని మర్యాదగా ప్రశాంతంగా జీవించకూడదా అని విచారించింది. అయినా గట్టిగా చెప్పటానికి సాహసించ లేదు. తనలో తానే బాధపడి క్రుళ్లుతోంది. పరిస్థితులకి లొంగిపోయిన మాలతికి తల్లి చూచాయగా యిస్తూన్న అభిప్రాయాలు తలకెక్కలేదు.

ఆ మరునాడు మాలతి తనయింట్లో ఒకరికి విందు చేయబోతుంది. పోలీసు సబిన్స్పెక్టరుగారని చెప్పిం దామె తల్లితో. అతని సిఫారస్‌తో ఆమెకు ఆరునెలల్లోనే డబుల్ ప్రమోషన్ సంపాదించింది. అందుకు బహుమానంగా అతనిని, ఆ నాటిరాత్రి తనయింటి కాహ్వానించింది. లంచములు పుచ్చుకొనుటలో మంచి అనుభవశాలి ఆ పోలీసు సబిన్స్పెక్టరు.

సాయంత్రం ఆరుగంటలయింది. గదంతా అలంకరించి అతనికోసం ఎదురు చూస్తోందిమాలతి. ఆయన వచ్చేవేళకు అన్నీ తయారుచేసి పంపాలని ఆదేశించింది సుందరమ్మకు. ఇంతలోనే ఆయన వచ్చేడు. తలపండుతోన్నా పడుచుతో ఆనందించాలని ఆశతో వున్నాడాయన. పలహారంతిని కబుర్లలోకి దిగాడు. లోనున్న సుందరమ్మకు కడుపు తరుక్కుపోతోంది. ఈ వ్యాపారం నుంచి మాలతిని ఎల్లా తప్పించాలో ఆలోచిస్తోంది. గదిలోనుంచి పెద్ద నవ్వొకటి విని అదరి పడింది. అది తనకు పరిచితమైన కంఠమల్లె వినిపించింది. ఎవరో అని గదివద్దకువచ్చి లోనికి తొంగిచూచింది

"మాలతీ" అని ఆమె కేకవేసి క్రింద పడింది. మాలతి ఒక్కగంతులో తల్లివద్దకు వచ్చింది. అప్పటికే సుందరమ్మ గుండె ఆగిపోయింది. అతి కష్టంతో "ఆయన మీనాన్న" అని అసువులను బాసింది.